RNI NO :Title-Code :-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దినపత్రిక

అనుక్షణం ప్రజలపక్షం...



WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.

వార్త KKR NEWS

ఎడిటర్ : బిర్రు కరుణాకర్

Cell: 9701249103



ప్రచురణ : హైదరాబాద్, | బుధవారం 3-1 -2024 | సంపుటి :01 | ఎడిటర్ : బిర్రు కరుణాకర్ | సంచిక : 09 | పేజీలు : 4 | వెల : 5-00


## కాళేశ్వరంపై కిషన్ రెడ్డి వ్యాఖ్యలకు మంత్రి పొన్నం కౌంటర్



వివరాలు 2లో

# మెట్రో విస్తరణపై సీఎం రేవంత్ సమీక్ష

ఐదు సెక్టార్లలో అబివృద్దికి ప్రణాళిక

ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం





హైదరాబాద్,జనవరి2**జర్నలిస్ట్ వార్త** మెట్రో రైల్వేపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. మెట్రో లైన్ పొడిగింపు, ప్రస్తుత పరిస్థితిపై అధికా రులతో సీఎం చర్చించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మెట్రో మార్గం ప్రణా ళికలపై అధికారులు ముఖ్యమంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఎయిర్‌పోర్టుకు మెట్రోను రద్దు చేయటం లేదని ఇప్పటికే స్పష్టత ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి.. పలు అంశాలను దృష్టిలో ఉంచుకుని వాటిని నవీకరిస్తున్నట్లు తెలిపారు. విమానాశ్రయానికి గత ప్రభుత్వం ప్రతిపాదించిన రూట్లతో పోలిస్తే దూరం తగ్గించి మెట్రో నిర్మిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. బీహెచ్‌ఈఎల్ నుంచి ఎయిర్‌పోర్టుకు 32 కిలోమీటర్లు ఉంటుందన్న సీఎం రేవంత్.. ఎంజీబీఎస్ నుంచి పాతబస్తీ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు మెట్రో ఉంటుందని చెప్పారు. నాగోల్ నుంచి ఎల్బీనగర్, ఓవైసీ హాస్పిటల్ మీదుగా చాంద్రాయణగుట్ట వద్ద ఎయిర్‌పోర్టుకు వెళ్లే మెట్రో లైన్‌ను లింక్ చేస్తామని వెల్లడించారు.

# ట్రక్కు డ్రైవర్ల సమ్మె..

## రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ **జర్నలిస్ట్ వార్త** ట్రక్కు డ్రైవర్ల సమ్మెపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ స్పందించారు. రోడ్? యాక్సిడెంట్ల కేసుల్లో శిక్షను భారీగా పెంచుతూ కేంద్ర ప్రభుత్వం భారత న్యాయ సంహిత చట్ట సవరణ చేయడాన్ని షెహన్షాకా ఫర్మానాగా ఆయన అభివర్ణించారు.

ఈ మేరకు మంగళవారం రాహుల్ ఎక్స్(ట్విటర్)లో స్పందించారు.'150 మంది ఎంపీలను సస్పెండ్ చేసి ప్రతిపక్షంతో చర్చించకుండా చట్టాలు చేయడం ప్రజాస్వామ్యంపై దాడే. భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటి డ్రైవర్లకు వ్యతిరేకంగా చేసిన చట్ట సవరణ వల్ల తీవ్ర పరిణామాలుంటాయి. కష్టపడి పనిచేసుకుని జీవితాలు గడిపే డ్రైవర్ల జీవితాలను చట్టాల పేరు చెప్పి ఇబ్బందుల పాలు చేయడం సరికాదు. ఈ చట్టాన్ని కొన్ని వ్యవస్థలు దుర్వినియోగం చేసి అవినీతికి పాల్పడే అవకాశం ఉంది'అని రాహుల్ గాంధీ హెచ్చరించారు.

ట్రక్కు డ్రైవర్ల సమ్మెతో సోమవారం(జనవరి 1) నుంచి దేశంలోని పలు నగరాల్లో బంకులకు పెట్రోల్, డిజిల్ సరఫరా ఆగిపోయింది. దీంతో ఆయా నగరాల్లో వాహనదారులు మంగళవారం ఉదయం నుంచి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెట్రోల్ కోసం ద్వి చక్ర వాహనదారులు బంకుల ముందు బారులు తీరారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై వారంలో జ్యుడిషియల్ ఎంక్వైరీ

- కాళేశ్వరంపై బిఆర్ఎస్, బిజెపిలు కలసిపోయాయి
- వాటాలు పంచుకుని పనిచేశాయి
- ఇప్పుడేమే కిషన్ రెడ్డి విమర్శలు దారుణం
- మండిపడ్డ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్,జనవరి2**జర్నలిస్ట్ వార్త** కాళేశ్వరం ప్రాజెక్టుపై ఈ వారంలో జ్యుడిషియల్ ఎంక్వైరీ వేయబోతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం నాడు సెక్రటేరియట్ మీడియా సెంటర్‌లో ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... కాళేశ్వరం ప్రాజెక్టులో బీఆర్ఎస్, బీజేపీ కలిసి అవినీతికి పాల్పడ్డాయన్నారు. కాళేశ్వరంపై పదేళ్ల నుంచి సీబీఐ విచారణ ఎందుకు జరపలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం డ్యామేజ్ రిపేర్ చేసే బాధ్యత ఏజెన్సీదేనని చెప్పారు. కిషన్‌రెడ్డి నిరాధారమైన ఆరోపణలతో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ 3500 రోజులు సన్నిహితంగా గడిపి 20 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని ధ్వజమెత్తారు.

## పదేళ్లుగా బిఆర్ఎస్ అవినీతిపై ఎందుకు విచారించలే

- కేంద్రంలో అధికారంలో ఉన్నా ఎందుకు అడుగు వేయలే
- సిబిఐ విచారణ కోరడం కెసిఆర్‌ను రక్షించడానికే
- కిషన్ రెడ్డి డిమాండ్‌పై మండిపడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్,జనవరి2**జర్నలిస్ట్ వార్త** కాలేశ్వరం అవినీతిపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన జ్యూడీషియల్ ఎంక్వైరీకి బీజేపీ సహకరించాలని.. కాళేశ్వరంపై సీబీఐ విచారణకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ రాయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. అనేక కేసుల్లో కేసీఆర్ ఫ్యామిలీని బీజేపీ రక్షించిందని అన్నారు. ఇన్నేళ్లుగా కేసీఆర్ పై విచారణ ఎందుకు చేయట్లేదని బీజేపీని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్‌ను రక్షించేందుకే కిషన్ రెడ్డి సీబీఐ ఎంక్వైరీ కోరుతున్నారని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కేసీఆర్ బినామీ అని వ్యాఖ్యానించారు. ఎంఐఎం, బీజేపీ, బిఆర్ఎస్ ఒకటేనని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధిలో బీజేపీ పాత్ర శూన్యంగా ఉందని మండిపడ్డారు. పదేళ్లపాటు బిఆర్ఎస్‌కు వత్తాసు పలికి, వారి అక్రమాలను చూస్తూ వదిలేసిన వారు ఇప్పుడు నీతులు చెబుతున్నారని మంత్రి మండిపడ్డారు. పదేళ్లుగా అవినీతిపై డిమాండ్ చేస్తున్నా ఎందుకు పట్టించుకోలేదన్నారు. కేందరమంత్రిగా కిషన్ రెడ్డి ఏం చేశారని మంత్రి పొన్నాం నిలదీశారు. ప్రజా పాలన దరఖాస్తులకు పొడగింపు లేదని.. జనవరి 6 లోపే అందరూ అప్లై చేసుకోవాలని మంత్రి పొన్నం వెల్లడించారు.

## సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన బీజేపీ మాజీ ఎంపీ శాంత



తాడేపల్లి: **జర్నలిస్ట్ వార్త** మాజీ ఎంపీ, బీజేపీ నాయకురాలు జే. శాంత మంగళవారం వైఎస్సార్‌సీపీ పార్టీలో చేరారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పాల్గొన్నారు. కాగా అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన మాజీ ఎంపీ జే శాంత వాల్మీకి సామాజికి వర్గానికి చెందినవారు. 2009లో బీజేపీ తరపున కర్ణాటకలోని బళ్లారి నుంచి ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ శాంతమ్మ మాట్లాడుతూ.. జగన్ పాలనలోనే వాల్మీకిలకు ప్రాధాన్యం లభించిందన్నారు. వైఎస్సార్‌సీపీ సిద్ధాంతాలు చూసి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. దేశంలో ఎవరూ చేయని సంక్షేమ పథకాలను జగన్ అమలు చేస్తున్నారని ప్రశంసించారు. ఇక నుంచి ఒక సామాన్య కార్యకర్తగా వైఎస్సార్‌సీపీలో పని చేస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరికీ తాను తోడుంటానని.. అందరం కలిసి జగన్‌కు అండగా ఉందామన్నారు. జగన్ చేస్తున్న మంచి పనులు దేశమంతటా తెలుసన్నారు జే శాంత. ఒక ఇంటికి పెద్దకొడుకు ఎలా బాధ్యతగా ఉంటారో సీఎం జగన్ అలా పని చేస్తున్నారని తెలిపారు. ఏపీ రాష్ట్రం జగన్ పాలనకు దాసోహం అంటోందని.. అలాంటి పార్టీలో తాను కూడా ఒక సైనికురాలిగా పని చేస్తానని చెప్పారు.

## పార్లమెంట్ ఎన్నికలపై బిఆర్ఎస్ దృష్టి

నేటినుంచి పార్టీ నేతలతో కెటిఆర్ సమీక్ష - వచ్చే లోకసభలో గెలుపే లక్ష్యంగా భేటీలు



హైదరాబాద్,జనవరి2**జర్నలిస్ట్ వార్త** తెలంగాణ ఎన్నికలలో పరాభవంతో డీలా పడిపోయిన బీఆర్ఎస్ నేతలు, శ్రేణులను వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం సమాయత్తం చేయడంపై బీఆర్ఎస్ దృష్టి పెట్టింది. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు ఇందు కోసం కసరత్తు ప్రారంభించారు. కసరత్తులో భాగంగా కేటీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు, మాజీ శాసనసభ్యులు, ముఖ్యనేతలతో వరుస భేటీలకు రెడీ అయ్యారు. బుధవారం నుంచి వరుస భేటీలతో పార్లమెంట్ ఎన్నికలకు నేతలను సన్నద్ధం చేయబోతున్నారు. ఈ భేటీలలో లోక్ సభ ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహం, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై చర్చించి నేతలకు, క్యాడర్ కు దిశా నిర్దేశర చేయనున్నారు. ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికలలో సిట్టింగులకు టికెట్లు కేటాయించడం వల్లనే భంగపా టుకు గురయ్యామన్న అంచనాల నేపథ్యంలో కేటీఆర్ ప్రధానంగా లోక్ సభ అభ్యర్థుల మార్పుపై దృష్టి పెట్టినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలలో సిట్టింగులకు టికెట్లు ఇవ్వకుండా ఉంటే మరిన్ని స్థానాలలో బీఆర్ఎస్ విజయం సాధించి అధికారపగ్గాలను అందుకుని ఉండేదన్న భావనలో ఉన్న పార్టీ అధినాయత్వం, అటువంటి పొరపాటు లోక్ సభ ఎన్నికలలో జరగకుండా పార్టీ అభ్యర్థుల ఎంపికలో ఆచి తూచి నిర్ణయం తీసుకోవాలన్న నిశ్చయయంతో ఉంది. ఇటీవలి ఎన్నికల్లో గ్రేటర్‌లో బీఆర్ఎస్ కు ప్రజలలో గట్టి పట్టు ఉందని రుజువు కావడంతో ఇక్కడ ఉన్న రెండు పార్లమెంటు స్థానాలలోనూ అభ్యర్థులను రంగంలోకి దింపాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భావిస్తున్నట్లు చెబుతున్నారు.

## రాష్టాన్ని అధోగతిపాలు చేసిన జగన్

అబివృద్ది పేరుతో విద్వంసం చేశారు

ఐదేళ్లుగా రాజధాని లేని రాష్ట్రంగా మిగిల్చారు

జగన్ పాలనపై మాజీమంత్రి అయ్యన్న విమర్శలు





## దళితుల పట్లనే వైసిపిలో వివక్ష

- వ్యతిరేకత పేరుతో దళిత సీట్లు మార్చే యోచన

-సిఎం జగన్ ఆదేశాల మేరకే పనిచేశాం

-పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఆగ్రహం



వివరాలు 2లో

# కాళేశ్వరంపై కిషన్ రెడ్డి వ్యాఖ్యలకు మంత్రి పొన్నం కౌంటర్



రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతున్నది. జనవరి 6తో ఈ అప్లికేషన్‌ల స్వీకరణ ముగియనున్నది. దీంతో ప్రభుత్వం గడువును పెంచుతుందా లేదా అనే చర్చ జరుగుతున్న వేళ దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ క్లారిటీ ఇచ్చారు.జనవరి 6వ తేదీ వరకు అప్లికేషన్లు స్వీకరిస్తామని ఆ తర్వాత గడువు పొడిగింపు ఉండదని స్పష్టం చేశారు. మంగళవారం సెక్రటేరియట్ లో మీడియాతో మాట్లాడిన ఆయన.. అర్హులైన వారికి కుటుంబానికి ఒక్కటి చొప్పున ప్రభుత్వమే అప్లికేషన్ ఫారమ్ లు అందజేస్తుందని వాటి ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

**కిషన్ రెడ్డికి కౌంటర్**

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ కాంగ్రెస్ డ్రామాలు ఆడుతున్నాయని, సీబీఐ దర్యాప్తు చేయించకుండా గత బీఆర్ఎస్ పాలకులను కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడే ప్రయత్నం చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి వ్యాఖ్యలకు మంత్రి పొన్నం కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ ప్రతిపాదిత బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి అనేక చిలకపలుకులు పలుకుతున్నారని, కేసీఆర్ స్క్రిప్ట్ నే కిషన్ రెడ్డి చదివి వినిపించారని ఎద్దేవా చేశారు. దీని ద్వారా రాబోయే ఎన్నికల్లో లబ్ధి చేకూరుతుందనే ఇలా మాట్లాడుతున్నారని కానీ అటువంటిదేమీ జరగదన్నారు. కిషన్ రెడ్డి కోరుతున్నట్లుగా సీబీఐ దర్యాప్తుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సీబీఐ అనేది కేంద్ర సంస్థ ఆధ్వర్యంలో పని చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసినా రాయకపోయినా కేంద్ర మంత్రి హోదాలో కేంద్ర పెద్దలకు లేఖ రాసి సీబీఐ దర్యాప్తును చేయించవచ్చన్నారు.కేంద్రంలో బీజేపీనే అధికారంలో ఉన్నప్పటికీ ఎంక్వయిరీకి మేమే అడ్డుపడుతున్నట్లుగా కిషన్ రెడ్డి గారు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కానీ కేసీఆర్‌ను రక్షించేందుకే కిషన్ రెడ్డి సీబీఐ ఎంక్వయిరీ కోరుతున్నారని ధ్వజమెత్తారు. సీబీఐ దర్యాప్తులో ఏం జరుగుతుందో అందరికీ తెలుసని సీబీఐ దర్యాప్తు చేస్తున్న లిక్కర్ స్కాం, సహారా స్కామ్ కేసులతో పాటు ఇతర అనేక స్కామ్‌లలో ఎంత మందికి శిక్ష పడిందని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జ్యుడీషియరీ ఎంక్వయిరీకి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కిషన్ రెడ్డికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే తన కేంద్ర మంత్రి పరపతిని ఉపయోగించి సిట్టింగ్ జడ్జితో కేటాయించే ప్రయత్నం చేయాలన్నారు. కిషన్ రెడ్డి కేసీఆర్ కు బినామీ అని, బండి సంజయ్ ని తప్పించి కేసీఆర్ కు కిషన్ రెడ్డి నీడలా వ్యవహరిస్తారని ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ డ్రామాలు ఆడుతోందని మండిపడ్డారు. అనవసర రాజకీయం కాకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చేందుకు కిషన్ రెడ్డి ఎలాంటి సహకారం ఇస్తారో చెప్పాలన్నారు.

**డ్రైవర్ల ధర్నాపై కేంద్రం స్పందించాలి..**

కేంద్రం తీసుకున్న న్యాయ సంహిత 2023 చట్టం పై దేశవ్యాప్తంగా ట్రక్కు డ్రైవర్లు ఆందోళన చేస్తుంటే కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి దీనిపై స్పందించడం లేదన్నారు. కేంద్రం తీసుకొచ్చిన ఈ చట్టాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేసి డ్రైవర్లతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున డిమాండ్ చేస్తున్నారు. నేరస్తులకు శిక్ష పడకూడదని తాను అనడం లేదని డ్రైవర్ల అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. డ్రైవర్ల ధర్నా చాలా సెన్సిటివ్ ఇష్యూ అని దీని వల్ల సామాన్య జన జీవనం పై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు.

# నెరవేరని వ్యక్తిగత మరుగుదొడ్ల లక్ష్యం

**ఆశించిన ఫలితం సాధించని పథకం - గ్రామాల్లో మరింతగా చైతన్యం రావాల్సిందే**

కర్నూలు,జనవరి2 దేశవ్యాప్తంగా వ్యక్తిగత మరగుదొడ్ల నిర్మాణం కోసం నేటికీ స్పష్టత లేదు. ఇంతకాలం ప్రచారం చేసినా ఇంకా లక్ష్యం నెరవేరడం లేదు.గ్రామసీమల్లోని 42 శాతం జనాభాకు నేటికీ మరుగుదొడ్లు కరవైన పరిస్థితిలో, కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలూ వాటి నిర్మాణ నిర్వహణల్ని ఓ సవాలుగా భావిస్తున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొన్ని జిల్లాల్ని ఓడీఎఫ్‌లుగా ప్రకటించింది. వార్డు కమిటీలు, స్వయంసహాయక సంఘాలు, పట్టణ సమాఖ్యల ఉమ్మడి కృషితో కొన్ని గ్రామాలు ఈ లక్ష్యం సాధించాయి.. కూలిపనులు చేసి సంపాదించిన సొమ్ముతో మరుగుదొడ్లు నిర్మించుకొని ఇతర ప్రాంతాలవారికి ఆదర్శ ప్రాయులయ్యారు. అధికారుల కృషితోనే నియోజకవర్గంలో నూరు శాతంఓడీఎఫ్ దిశగా అడుగులు పడతాయి. సమీక్షలు, సమావేశాలు నిర్వహించి సర్పంచ్‌లను పురమాయించడంతో మరుగుదొడ్ల నిర్మాణాలపై ప్రజలు దృష్టి సారించారు. దీంతో గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు ఉద్యమంలా సాగుతున్నాయి. ఓడీఎఫ్ సాధించేందుకు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ సంక్షేమ పథకాలను కట్ చేస్తూ మరుగుదొడ్ల నిర్మాణాలను ఉద్యమంలా చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో 46శాతం ప్రజలు మరుగుదొడ్లు ఉపయోగిస్తున్నారు. దీనిఇకతోడు పరిశుభ్రతకు సంబంధించిన పనులు తమకు సంబంధించినవి కావన్న ధోరణిలో ప్రజలు ఉన్నారు. పరిశుభ్రతా సాధనలో భాగంగా, శౌచాలయ వ్యవస్థపై ఎనలేని కేంద్రం శ్రద్ధ చూపుతోంది. బహిరంగ మలవిసర్జన రహిత ఊళ్లు, ఇంటింటా మరుగుదొడ్లు' ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యక్రమాలు చేపట్టి ఇప్పటికి మూడేళ్లు గడిచాయి. ఏపీ ప్రభుత్వం వివిధ విభాగాలవారితో ప్రచార బృందాల్ని ఏర్పాటుచేసి, మారుమూల గ్రామాలకీ పంపించీ అవగాహన పెంచేందుకు కృషిచేస్తోంది. ఏపీలోని అనేక గ్రామాలు బహిర్భూమి సమస్య నుంచి సంపూర్ణంగా బయట పడ్డాయని కేందప్రభుత్వ ఆధ్వర్యంలోని పారిశుద్ధ్య మంత్రిత్వశాఖ ఇదివరకే వెల్లడించింది. మొత్తం 72లక్షల మరుగుదొడ్లు అవసర మైన ఏపీలో ఇప్పటికే 44.1 లక్షల నిర్మాణాలు పూర్తయ్యాయి. వాటి ఏర్పాటుతో పాటు వినియోగమూ ముఖ్యమంటూ వందల సంఖ్యలో సదస్సులు నిర్వహించారు. పాఠశాలల్లో మరుగదొడ్ల ఏర్పాటును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలి ప్రాథమ్యంగా ప్రకటించింది. ప్రభుత్వాల, ప్రజల ఆలోచనా ధోరణిని బట్టే శౌచాలయ నిర్మాణ పక్రియ ముందుకు సాగుతుంది. ఉమ్మడి భాగస్వామ్యమే స్వచ్ఛతను, శుభ్రతను సాకారం చేస్తుంది.అందుకు అనుగుణంగా అవసరమైతే కఠినచర్యలు



తీసుకోవాలి. స్వచ్ఛతకు సంబంధించి ప్రజల్లో చైతన్యంతో పాటు కఠిన నిబంధనలు అమల్లోకి రావాలి. దీనిని తప్పనిసరి చేయడం ద్వారానే లక్ష్యం సాధించగలం.

# రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన జగన్

విశాఖపట్టణం,జనవరి2 జగన్‌కి తండ్రి వైఎస్ రాష్ట్రాన్ని దోచుకోవడం మాత్రమే నేర్పారని, నాయ్యకత్వ లక్షణాలు బోధించలేదని మాజీమంత్రి అయ్యన్న పాత్రుడు విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రాన్ని లూటీ చేసి దోచుకున్నారని అందుకే 14 నెలలు జగన్‌ని జైల్లో పెట్టారన్నారు. అవినీతిపరులే నేడు నీతులు బోధిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో సాగునీటి రంగంతో సహా అనేక రంగాల్లో అభివృద్ధి తెలుగుదేశం హయాంలోనే సాగింన్నారు. హేతుబద్ధత లేకుండా రాష్ట్రాన్ని విభజించిన తరవాత చంద్రబాబు అహోరాత్రులు కష్టపడి ఎపిని ముందుకు తీసుకుని పోతే..దానిని ఇప్పుడు జగన్ తన ఐదేళ్ల పాలనలో పూర్తిగా నష్టపరిచారని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటైన రెండున్నర ఏళ్లలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామన్నారు. ఎన్నో అడుగులు పడ్డ ఎపిని జగన్ 20 ఏళ్ల వెనక్కి తీసుకుని వెళ్లారని మండిపడ్డారు. ఎన్నికల సందర్భంగా జగన్ అనేక హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక కేవలం కొన్ని మాత్రమే నెరవేర్చారు. అంటే.. 15 శాతం అమలు చేసి 85 శాతం ఫెయిల్ అయ్యారు. కానీ 99.5 శాతం హామీలు అమలు చేశానంటూ ప్రతి సభలోనూ సీఎం జగన్ అబద్దాలు చెబుతున్నారని అంటూ మాజీ మంత్రి విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వం అమలు చేసిన 120 సంక్షేమ పథకాలను జగన్‌రెడ్డి రద్దు చేశారన్నారు. పరిశ్రమలను పొరుగు రాష్ట్రాలకు తరిమేశారన్నారు. రాజధానిని విధ్వంసం చేశారని విమర్శించారు. పోలవరాన్ని రివర్స్ చేయడం ద్వారా నదుల అనుసంధానానికి గండికొట్టి రాష్ట్రాన్ని మద్యనిషేధం చేసి ఓటు అడుగుతానన్న హామీకి విరుద్ధంగా.. మద్యంపై ఆదాయాన్ని 15 ఏళ్లపాటు బ్యాంకులకు తాకట్టు పెట్టి అప్పు తెచ్చుకున్నారని గుర్తుచేశారు. విద్యుత్ ఛార్జీలు పెంచనన్న హామీకి గండికొట్టి రూ.64 వేల కోట్ల భారాన్ని రాష్ట్రప్రజలపై మోపారన్నారు. సీపీఎస్ రద్దు, రైతు రుణమాఫీ, మద్యనిషేధం, అమరావతి అభివృద్ధి, ఇసుక అక్రమ తరలింపు అడ్డుకట్ట వంటి అనేక హామీలపై జగన్ మాట తప్పారన్నారు. అయినా, తాను 99.5 శాతం హామీలు అమలు చేశానంటూ అబద్దాలు చెప్పడం ఆయనకే చెల్లిందని అయ్యన్నపాత్రుడు విమర్శించారు. 'చంద్రబాబు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేదలను సొంత కాళ్లపై నిలబెట్టేలా చేశాయి. జగన్ సంక్షేమ పథకాలు పేదలను నిరుపేదలుగా చేసి ఓటు యంత్రాలుగా మార్చి ఆయనపై ఆధారపడే బిచ్చగాళ్లుగా చేశాయని విమర్శించారు.

# దళితుల పట్లనే వైసిపిలో వివక్ష

చిత్తూరు,జనవరి2 వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో టిక్కెట్ల కసరత్తు రాను రాను వివాదాస్పద మవుతోంది. నేరుగా సీఎం జగన్‌పైనే ఎమ్మెల్యేలు విరుచుకుపడుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు తన ఆగ్రహాన్ని ఆపుకోలేదు. తనపై వ్యతిరేకత ఉందని సీటు ఇవ్వనని చెబితే ఎలా కుదురుతుందని ఆయన ప్రశ్నించారు. తాను జగన్ చెప్పిన పనులన్నీ చేశానని ఆయన అన్నారు. జగన్ చెప్పిన పనులన్నీ చేసినప్పుడు అసంతృప్తి ఉంటే అది తనవల్ల ఎలా అవుతుందని ఆయన నిలదీశారు. తాను ఏం తప్పు చేశానో జగన్ పిలిచి చెప్పాలని ఎంఎస్ బాబు డిమాండ్ చేశారు. తాను జగన్ ను కలిసినప్పుడు వ్యతిరేకత ఉందని తనతో అన్నారని ఎంఎస్ బాబు మీడియాకు తెలిపారు. తనపై వ్యతిరేకత వచ్చిందంటే ఎవరిది బాధ్యత అని ఆయన ప్రశ్నించారు. జగన్ చెప్పినట్లే తాను గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో తిరిగానని అన్నారు. ఐదేళ్ళలో ఒక్కసారి కూడా మమ్మల్ని పిలిచి మాట్లాడలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ రకంగా సీఎం జగన్మోహన్ రెడ్డిపై పూతలపట్టు ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు ధిక్కార స్వరం వినిపించారు. దళితులకు జగన్ ఎలాంటి న్యాయం చేయలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నా బీసీ.. నా ఎస్సీ.. నా ఎస్టీ' అంటున్న జగన్ దళితుల పట్ల ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాబు మండిపడ్డారు. దళిత నియోజకవర్గంలోని ఎమ్మెల్యేల పనితీరు సరిగా లేదంటూ ఎందుకు టికెట్ ఇవ్వకుండా నిరాకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఐదేళ్ల కాలంలో ఎమ్మెల్యేలను ఒక్క రోజు అయినా చేరదీసి జగన్ తమ మంచి చెడ్డా గురించి మాట్లాడిన పాపాన పోలేదన్నారు. ఐ ప్యాక్ సర్వేలో పనితీరు సరిగా లేదంటూ ఎక్కువగా దళిత నియోజకవర్గంలోనే మార్పులు ఎందుకు చేపడుతున్నారని అన్నారు. 2019 ఎన్నికల్లో ఐపెక్ సర్వేల ద్వారానే టికెట్లు ఇచ్చారా? పార్టీ కోసం కుటుంబాన్ని వ్యాపారాన్ని అన్ని వదులుకొని ఐదేళ్లు పార్టీ, ప్రజాసేవలో లీనమైపోయా.

## పురాతన మండపాలకు జీర్ణోద్ధరణ

**అలిపిరి మండపం కోసం ఆర్కియాలజీకి రాసాం**

**మార్పులు చేస్తే తప్పేమిటన్న ఇవో ధర్మారెడ్డి**

తిరుమల,జనవరి2 పురాతన మండపాలు శిధిలావస్థకు చేరుకుంటే మరమ్మతులు చెయొచ్చని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కూలిపోయే పరిస్థితి ఉంటే జీర్ణోద్ధరణ చెయ్యడంతో పాటు భక్తులకు అనువుగా మార్పులు చేయొచ్చన్నారు. దేశంలో చాలా ఆలయాల నిర్మాణాలు టీటీడీలో వేద విద్య అభ్యసించిన విద్యార్థుల సూచన మేరకు నిర్మిస్తున్నారని తెలిపారు. అలాంటిది టీటీడీలో పురాతన మండపాల శిథిలావస్థకు చేరుకుంటే మరమ్మతులు చెయ్యకూడదా అని ప్రశ్నించారు. అలిపిరి పాదాల మండపం వద్ద శిథిలావస్థకు చేరుకున్న మండపం పునర్నిర్మాణం కోసం ఆర్కియాలజీ అఫ్ ఇండియాకు ఇప్పటికే పలుమార్లు లేఖలు రాశామన్నారు. కడప జిల్లా సోమనాథ స్వామి ఆలయంలో గోడ కూలితే మరమ్మత్తుల కోసం ఆర్కాలజీ అఫ్ ఇండియాకు లేఖ రాసినప్పటికీ స్పందన లేదన్నారు. కొందరు రాజకీయ దురుద్దేశంతో గందరగోళం సృష్టించడం వల్ల అలిపిరి వద్ద మండపం పునర్నిర్మాణం ఆగిందని టీటీడీ ఈవో వెల్లడించారు. శేషాచల అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల ద్వారా జంతు కదలికలను ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నామని తెలిపారు. త్వరలోనే రూ.3.5 కోట్లతో ఆధునాతన కెమెరాలను కొనుగోలు చేస్తున్నామన్నారు. ఈ కెమెరాల ఏర్పాటుతో జంతు కదలికలను వెంటనే గుర్తించవచ్చని టీటీడీ ఈవో ధర్మారెడ్డి పేర్కొన్నారు. ఇదిలావుంటే వైకుంఠ ఏకాదశిని పురస్కరించు కుని డిసెంబర్ 23 నుంచి పది రోజుల పాటు వైకుంఠ ద్వారాలను టీటీడీ తెరిచే ఉంచింది. వైకుంఠ ద్వారం గుండా గత పది రోజులుగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. పదిరోజుల్లో వైకుంఠ ద్వారాల గుండా స్వామివారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య, హుండీ ఆదాయ వివరాలను టీటీడీ ఈవో ధర్మారెడ్డి మీడియాకు వెల్లడించారు. శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వారాలు తెరిచిన 10 రోజుల్లో దాదాపు 6లక్షల 47వేల 452 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారని ఈవో తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది అదనంగా 40వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారన్నారు. అలాగే శ్రీవారి హుండీ ద్వారా రూ.40.10 కోట్లు ఆదాయం లభించిందని చెప్పారు. 17.81 లక్షల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారని.. 35.60 లక్షల లడ్డులను భక్తులకు విక్రయించినట్లు తెలిపారు. 2లక్షల 13వేల మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారని టీటీడీ ఈవో ధర్మారెడ్డి వెల్లడించారు.

## ఆందోల్ అభివృద్ధికి మంత్రి అడ్డుపుల్ల

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

సంగారెడ్డి,జనవరి2 అందోల్‌లో అభివృద్ధి పనులను ఆపాలని మంత్రి దామోదర రాజనర్సింహ చూస్తున్నారని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆరోపించారు. మంగళవారం ఆయన సంగారెడ్డిలో మీడియా సమావేశంలో మంత్రిపై నిప్పులు చెరిగారు. నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆందోల్ నియోజకవర్గంలో ఎస్డీఎఫ్, సీడీపీ నిధులతో అభివృద్ధి పనులు చేశాను. 80 శాతం వరకు గ్రామాల్లో సీసీ రోడ్లు వేయించానని తెలిపారు. కొన్ని టెండర్లు పూర్తవగా మరికొన్ని పనులు నడుస్తున్నాయని పేర్కొన్నారు.

ఈ పనుల్ని ఆపాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారని ఆరోపించారు. మంజూరు అయిన నిధులు సరిపోకపోతే ఇంకా నిధులు ఇవ్వండి. కానీ పనులను మాత్రం ఆపవద్దన్నారు. అభివృద్ధి పనుల్లో రాజకీయ కక్షసాధింపు చర్యలు సరికావని హితవు పలికారు. అభివృద్ధికి మంత్రి సహకరించాలని కోరారు.

## విశాఖలో జిల్లా సహాయక నిధి ఏర్పాటు

**నెల జీతాన్ని విరాళంగా ఇచ్చిన కలెక్టర్**


**కలెక్టర్ ప్రకటనతో ముందుకు వచ్చిన ఉద్యోగులు**

**స్వచ్ఛందంగా రూ.14,22,368 విరాళాలు జమ**

విశాఖపట్టణం,జనవరి2 నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా విశాఖ జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున ఔదార్యాన్ని చాటుకున్నారు. గొప్ప మానవత్వాన్ని ప్రదర్శించారు. తన నెల జీతం మెత్తాన్ని నిరుపేదలు, నిస్సహాయుల కోసం కేటాయించారు. అంతే కాదు అందరూ ఈ క్రతువులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. దీంతో కలెక్టర్ పిలుపు మేరకు విశాఖపట్నం జిల్లాలో పనిచేస్తున్న వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగులు అందరూ నిరుపేదలు, నిరాశ్రయుల సహాయం కొరకు ఏర్పాటు చేసిన సంజీవనీ నిధి డిస్టిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు స్వచ్ఛందంగా రూ.14,22,368 విరాళాలుగా అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. స్వయంగా జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున నే తన ఒక నెల జీతం రూ.1,10,000/- అందజేసి తన పెద్ద మనుసును చాటుకోవడంతో మిగతా ఉద్యోగులు కూడా ఉద్యమంలా ముందుకు వచ్చారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయ సిబ్బంది రూ.12,000/-, రెవెన్యూ డిపార్టుమెంటులో విధులు నిర్వర్తిస్తున్న డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, ఉద్యోగులు, ఏపీ రెవెన్యూ అసోసియేషన్, విశ్రాంత ఉద్యోగులు ఇతర వివిధ శాఖల ఉద్యోగులు రూ.2,85,845 చెక్కులను సంజీవని నిధి డిస్టిక్ట్ రిలీఫ్ ఫండ్ కి చెక్కులు, డీడీలు రూపంలో విరాళాలుగా అందజేశారు.కొత్త సంవత్సరం తొలిరోజున దీన్ని కలెక్టర్ ప్రారంభించారు.. గత ఏడాది కూడా కలెక్టర్ పిలుపునకు ఉద్యోగులు, అధికారులు స్పందించారు. ఒక్కరోజు వ్యవధిలో ఏకంగా రూ.10,92,998 జమ అయింది. ఈసారి అది 14 లక్షల 22 వేలకు చేరింది.

## నేటినుంచి మరోమారు ప్రజల్లోకి భువనేశ్వరి

**నిజం గెలవాలి పేరుతో మూడు జిల్లాల్లో పర్యటన**



అమరావతి,జనవరి2 టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి మరోసారి ప్రజల్లోకి వెళ్లనున్నారు. చంద్రబాబును అరెస్ట్ చేసి జైలులో పెట్టినప్పుడు 'నిజం గెలవాలి' పేరుతో ప్రజల్లోకి వెళ్లారు. దీంతో మంచి స్పందన లభించింది. ఇప్పుడు మరోమారు బుధవారం నుంచి మూడు రోజులపాటు భువనేశ్వరి నిజం గెలవాలి పేరుతోనే పర్యటనలు కొనసాగనున్నాయి. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నంలో భువనేశ్వరి పర్యటన కొనసాగనుంది. బుధవారం విజయనగరం జిల్లాలో, ఈనెల నాలుగన శ్రీకాకుళం జిల్లాలో, ఐదున విశాఖ జిల్లాలో భువనేశ్వరి పర్యటించనున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనస్థాపానికి గురై చనిపోయిన కుటుంబాలను పరామర్శించనున్నారు. ఇప్పటికే ఒకసారి వెళ్లి కొన్ని కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించిన విషయం తెలిసిందే. కాగా.. అక్రమంగా అరెస్ట్ అయిన చంద్రబాబు నాయుడు విడుదల కోసం సతీమణి భువనేశ్వరి చేసిన పోరాటం అంతా ఇంతా కాదు. చంద్రబాబు అరెస్ట్ నుంచి రాజమండ్రిలోనే ఉంటూ ప్రజలతో మమేకమయ్యారు. చంద్రబాబు విడుదల కోసం చేపట్టిన కార్యక్రమాల్లో భువనేశ్వరి చురుగ్గా పాల్గొన్నారు. ప్రజల్లోనే ఉంటూ.. వారి సాదకబాధలను కూడా అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా చంద్ర బాబు అరెస్ట్ సందర్భంగా మనస్థాపంతో చనిపోయిన వారి కుటుంబాలను కూడా భువనేశ్వరి పరా మర్శించారు.

## మంటల్లో చిక్కుకున్న జపాన్ ఎయిర్‌లైన్స్ విమానం..

**367 మంది ప్రయాణికులు..**







టోక్యో, టోక్యోలోని హనెడా విమానాశ్రయంలో మంగళవారం ప్రమాదం చోటు చేసుకుంది. జపాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన జేఏఎల్ 516 విమానం ప్రమాదానికి గురైంది.విమానాశ్రయంలోని రన్ వేపై దిగుతుండగా మంటల్లో చిక్కుకుంది. ఆ దేశ పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ %చీఎఖ% ప్రసారం చేసిన వీడియోల్లో విమానం కిటికీల నుంచి మంటలు రావడం కనిపించింది. కాగా.. ఈ ప్రమాదానికి కారణం కోస్ట్ గార్డ్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను ఢీ కొట్టడమేనని తెలిపింది.కాగా.. ఈ ఘటన పై జపాన్ ఎయిర్‌లైన్స్ ప్రతినిధి మాట్లాడుతూ.. హక్కైడోలోని షిన్-చిటోస్ విమానాశ్రయం నుండి 300 మందికి పైగా ప్రయాణికులతో విమానం బయలు దేరినట్లు చెప్పారు. విమానం రన్ వే పై దిగుతున్న కోస్ట్ గార్డు ఎయిర్ క్రాఫ్ట్‌ను ఢీ కొట్టిన్నట్లుగా భావిస్తున్నట్లు చెప్పారు. క్షణాల్లోనే మంటలు వ్యాపించాయి.

## జగన్ పాలనలో ? అన్ని వర్గాల్లో ఆందోళన

**- అంగన్‌వాడీ, మున్సిపల్ సమ్మెపై నిర్లక్ష్యం**

**-సిపిఐ కార్యదర్శి రామకృష్ణ ఆగ్రహం**



విజయవాడ,జనవరి2: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఆందోళనలో ఉన్నారని, ఎన్నికల హామీలను అమలు చేయాలని అంగన్‌వాడీ, మునిసిపల్ కార్మికులు సమ్మె చేపట్టారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలని, కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమానికి సీపీఐ మద్దతు తెలుపుతుందని చెప్పారు. అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న వారి సమస్యలు పరిష్కరించనందు వలన వాళ్ళు సమ్మెకు వెళ్లారన్నారు. ఇప్పటి వరకు చేసిన అప్పులతో పోల్చితే కార్మికులకు ఇవ్వాల్సింది చాలా స్వల్పమని అన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతోందని, బైజుస్ కంపెనీ మనీ లాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటోందని, అటువంటి కంపెనీతో జగన్ ప్రభుత్వం ఎలా ఒప్పందం చేసుకుంటుందని రామకృష్ణ ప్రశ్నించారు. ప్రభుత్వం లాలూచితోనే బహిరంగంగా దోచుకుంటున్నారని, బైజుస్ సెంటర్ల వద్ద సీపీఐ నిరసన చేపడతాం, బైజుస్‌ని ప్రభుత్వం కట్టడి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రభుత్వ అవినీతిపై లేఖ రాసి మూడు నెలలు అయిందని, ఇంత వరకు స్పందన లేదని.. బీజేపీ, వైసీపీకి లింకు ఉంది కాబట్టే నేటి వరకు ఆ లేఖపై కేంద్రం స్పందించలేదని విమర్శించారు. వైసీపీకు ఉన్నదంతా కాంగ్రెస్ వోట్ బాంక్ అని, నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని రామకృష్ణ పిలుపిచ్చారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మరణించిన అగ్రిగోల్డ్ బాధితులకు పరిహారం పువ్వుల్లో పెట్టి ఇస్తానని, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో బాధితులకు న్యాయం చేస్తానని జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారని అన్నారు.

# నిబద్ధతతో పనిచేస్తున్నాం

– మంత్రి పొంగులేటి



ఖమ్మం బ్యూరో, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: గత ప్రభుత్వం పేదల సమస్యలను విస్మరించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. రోజుకు 16 గంటల పాటు చిత్తశుద్ధితో తాము పని చేస్తున్నామని తెలిపారు. ఖమ్మం గ్రామీణ మండలం మంగళగూడెంలో నిర్వహించిన ప్రజాపాలన సభలో పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనతో రాష్ట్రం ఆర్థికంగా ఎంతో నష్టపోయింది. 6.71 లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసింది. గత సీఎం ఎన్నో అప్పులు చేసి, ప్రజాధనంతో గొప్ప భవనం కట్టుకున్నారని విమర్శించారు. మా ప్రభుత్వం వచ్చిన వెంటనే 6 గ్యారంటీలను తొలి మంత్రివర్గ సమావేశంలో ఆమోదించామన్నారు. గ్యారెంటీ పథకాల అమలుతో కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధి కనిపిస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాం, ఆరోగ్యశ్రీ పరిధిని 10 లక్షలకు పెంచాం, మాటలు కాదు చేతల్లో చూపించాలనే నిబద్ధతతో వారి పార్టీ పనిచేస్తుందని పొంగులేటి అన్నారు. రెండు పర్యాయాలు తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని నమ్మి మోసపోయిన ప్రజలు మూడోసారి సరైన నిర్ణయాన్ని తీసుకొని, ప్రజాపాలనను గెలిపించుకున్నారని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



కాజీపేట, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తుందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధిలోని 48వ, డివిజన్ కాజీపేట దర్గాలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగల్ మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమం డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ, తేదీ వరకు ఉంటుందన్నారు. కాబట్టి దరఖాస్తు పత్రాల కోసం అధైర్యపడవద్దన్నారు. ప్రభుత్వ పథకాల కోసం ప్రజలకు దరఖాస్తు పత్రాలను పూర్తిస్థాయిలో అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారన్నారు. రేషన్ కార్డు లేకపోయినా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రజా పాలనలో భాగంగా వచ్చిన దరఖాస్తులను ఈ డివిజన్లలో ఏర్పాటుచేసిన కౌంటర్ల వద్ద అధికారులకు ప్రజలు సమర్పించారు. అదేవిధంగా ప్రజలకు చేరలవగా పాలనన అందించడానికి తెలుంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎందుకంటే ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాలను చేపడుతుందన్నారు. రాష్ట్రంలోని నిజమైన లబ్దిదారులకు దశల వారీగా, నిర్ణీత కాల వ్యవదిలో సామాజిక భద్రత కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ఆరు గ్యారెంటీలను నెరవేర్చడం ప్రభుత్వ బాధ్యతని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సింగారపు రవి ప్రసాద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎస్.కె అమర్, రవీందర్ రెడ్డి, కుమార్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీకి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే నాయిని



వరంగల్ బ్యూరో, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ, మొక్కను అందజేశారు. వారి వెంట రెడ్ క్రాస్ ఈసీ మెంబెర్ ఈ.వి.శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# గ్యారెంటీ పథకాల దరఖాస్తులు స్వీకరించిన పాలకుర్తి ఎమ్మెల్యే



తొర్రూరు, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: డివిజన్ కేంద్రంలోని 14వ, వార్డులో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే హనుమాన్ల యశస్విని రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గ్యారెంటీ పథకాల దరఖాస్తులను ఎమ్మెల్యే స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమం ఆధారంగా అర్హులైన వారిని ఆయా సంక్షేమ పథకాల లబ్ధికి ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు దరఖాస్తుదారులతో మర్యాదపూర్వకంగా మసులుకోవాలన్నారు. జనవరి 6వ, తేదీ వరకు నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అభయహస్తం కింద ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీ పథకాలను ప్రతీ కుటుంబానికి అందించే విధంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. దరఖాస్తు ఫారాలను ఏ ఒక్కరు కొనుగోలు చేయాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి దరఖాస్తు పత్రాన్ని ప్రభుత్వమే అందిస్తుందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగానే ప్రజాపాలన కొనసాగుతుందని అన్నారు.

అధికారులు ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులు తీసుకోవడానికి ప్రజల వద్దకే వస్తారన్నారు. పదేళ్ల గడీల పాలన అంతమై, రాష్ట్రంలో ప్రజాపాలన ఆరంభమైందన్నారు. ప్రతీ వార్డు, గ్రామంలో 100 మందికి కౌంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

6 పథకాలకు అర్హులైన వారే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హతలు లేని వారు దరఖాస్తు చేసుకొని సమయం వృధా చేసుకోవద్దన్నారు. ఏదైనా పని కోసం అధికారులు డబ్బులు అడిగితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. దరఖాస్తుదారుల వద్ద ఎవ్వరూ డబ్బులు ఆశించినట్లైతే వారిపై చర్యలు ఉంటాయన్నారు.అప్పులపై స్వేద పత్రం విడుదల చేసిన బీఆర్ఎస్ నాయకులు, ముందు కల్వకుంట్ల కుటుంబ ఆస్తులపై స్వేద పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రకటించిన పథకాల్లో రెండు అమలు చేశామని అన్నారు. త్వరలో మిగత హామీలను అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, మున్సిపల్ కమిషనర్ సరస్వతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షులు సోమ రాజశేఖర్, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్ రెడ్డి, కౌన్సిలర్లు తూనం రోజా ప్రభుదాస్, భూసాని రాము, గజానంద్, దొంగరి రేవతి, గుగులోత్ శంకర్, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీల్లో అవిశ్వాసం పురుడు పోసుకుంటుంది

- అవిశ్వాస తీర్మానం సమర్పించిన నర్సంపేట కౌన్సిలర్లు



వరంగల్ బ్యూరో, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: వరంగల్ జిల్లా పరిధిలోని మునిసిపాలిటీ కార్యాలయాల్లో అవిశ్వాసం పురుడు పోసుకుంటుంది. మంగళవారం నర్సంపేట మున్సిపల్ కు చెందిన 12 మంది కౌన్సిలర్లు వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానాన్ని సమర్పించారు. ప్రస్తుతం చైర్ పర్సన్ తీరు సరిగా లేదని కౌన్సిలర్లు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం చైర్ పర్సన్ అభ్యర్థిగా నాగిశెట్టి పద్మ ప్రసాద్ రేసులో ఉన్నట్లుగా సమాచారం వ్యక్తం అవుతుంది. చివరికి కలెక్టర్ నిర్ణయం కోసం కౌన్సిలర్లు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం వర్ధన్నపేట మున్సిపాలిటీలో ఇదే పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న కౌన్సిలర్లు చైర్ పర్సన్ బాధ్యతలు మరొకరికి అప్పగిస్తే ఈ కొద్ది సమయంలోనైనా మున్సిపల్ పరిధి మరింత అభివృద్ధి అయ్యే అవకాశం ఉంటుందని వారు అభిప్రాయపడుతూ అంతర్గత రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. నర్సంపేట తరువాత ప్రస్తుతం వర్ధన్నపేట కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం కలెక్టర్ కార్యాలయంలో సమర్పించే అవకాశం ఉన్నట్లు చర్చ సాగుతోంది. చివరికి మున్సిపాలిటీల పరిస్థితి ఏ విధంగా రూపాంతరం చెందుతాయో తెలియని అయోమయ పరిస్థితి మున్సిపాలిటీ కేంద్రాల్లో చోటు చేసుకుంది

## ఏఐసిసి ఇన్చార్జి దీపాదాస్ ని మర్యాదపూర్వకంగారాయపురం సాంబయ్య



వరంగల్ బ్యూరో, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఏఐసిసి ఇన్చార్జి దీపాదాస్ ని మంగళవారం కాంగ్రెస్ నాయకులు రాయపురం సాంబయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మహబూబాబాద్ పార్లమెంటు బరిలో పార్టీ అధిష్టానం అవకాశం ఇస్తే పోటీకి సిద్ధంగా ఉన్నట్లు సాంబయ్య వారితో వివరించారు. గత కొన్ని సంవత్సరాలుగా సామాన్య కార్యకర్తగా పోలింగ్ బూత్ ఏజెంట్, జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీ, గిరిజన విభాగాలలో కష్టపడి పని చేసినట్లు తెలిపారు. అధిష్టానం సర్వేలో తన పేరు వినిపిస్తే తప్పకుండా టిక్కెట్ ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.

# పర్యావరణ బాటసారికి ఘనంగా స్వాగతం

- పాలకుర్తి ప్రజా సంఘాలు



పాలకుర్తి, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: అతి చిన్న వయసులో దేశంలో పర్యావరణ పరిరక్షణ బాధ్యతను గుర్తిస్తూ, హర్యానా రాష్ట్రానికి చెందిన అజయ్ కుమార్ దేశవ్యాప్తంగా సైకిల్ యాత్రను మొదలుపెట్టి మంగళవారం పాలకుర్తికి చేరుకున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం 21 ఏళ్ల వయసులోనే భారతదేశం ఎల్లలు దాటుతూ ప్రస్తుతానికి తెలంగాణ రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. 10-12-2022 నాడు ప్రారంభించిన పర్యటన 18 రాష్ట్రాల గుండా బయలుదేరిన పర్యావరణ పరిరక్షణ బాటసారికి పాలకుర్తి ప్రజా సంఘాలవారు ఘనంగా స్వాగతం పలికారు. బహుజన కులాల ఐక్యవేదిక ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ప్రజా ప్రతినిధులు మంచుప్పుల సర్పంచ్, ముత్తారం ఎంపీటీసీ, పాలకుర్తి ఉపసర్పంచ్ బొమ్మగాని కొమురయ్య, బొమ్మగాని మానస భాస్కర్, తరాల చంద్రబాబు, పాలకుర్తి సీనియర్ వార్డు సభ్యులు గాదపాక ఎల్లయ్య, శివరాత్రి కొమురయ్య, దుంపల సంపత్, నంద్యాల ఉమాకర్, సీనియర్ జర్నలిస్టు ఎడవెల్లి సోము, యూట్యూబ్ ఛానల్ నిర్వాహకులు చేరిపెల్లి అశోక్, కాకర్ల కృష్ణ, తెలంగాణ ఉద్యమకారుడు నల్లమాస రమేష్, గాదపాక కిరణ్, గూడూరు లెనిన్, వివేకానంద తదితరులు అజయ్ కుమార్ యాత్రను స్వాగతించారు. ఈ సందర్భంగా తనని పూలమాలతో ఘనంగా సన్మానించి, శాలువాలతో సత్కరించారు. అనంతరం పాలకుర్తి నుండి నల్గొండ మీదుగా తన యాత్రను కొనసాగించనున్నట్లు అజయ్ కుమార్ మీడియా ప్రతినిధులకు తెలియజేశారు.

# విద్యుత్ షాక్ తో ఎద్దు మృతి



రాయపర్తి, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: రాయపర్తి మండలం జయరాం తండాలో మంగళవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో ఓ దుక్కిటేద్దు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. బాధిత రైతు లావుడియా మంజా తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని తన వ్యవసాయ


పొలంలో ఎద్దు మేతకు వెళ్ళిన క్రమంలో ప్రక్కనే వెలాడుతున్న కరెంట్ తీగలు ఎద్దుకు తగిలి ప్రమాదం సంభవించిందని తెలిపారు. దీంతో తన ఎద్దు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన ఎద్దు సుమారు 50 వేల రూపాయల విలువ ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయనకు జరిగిన నష్టాన్ని భర్తీ చేస్తూ, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నారు.

# అవిరామంగా సమ్మెలో పాల్గొన్న సిఐటియు నేతకు అస్వస్థత



ఏలూరు, 22వరోజు అంగన్వాడీ సమ్మె కొనసాగుతోంది. అంగన్వాడీలకు మద్దతుగా సమ్మెలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు శుక్లబోయినరాంబాబు పాల్గొంటున్నారు. అయితే మంగళవారం ఉదయం సమ్మె చేసే శిబిరం వద్ద రాంబాబు ఉన్నపాటుగా అస్వస్థతకుగురయ్యారు. 21 రోజుల నుంచి నిరసన దీక్షలో అవిరామంగా పాల్గొనడంతో రాంబాబు ఆరోగ్యం క్షీణిం చింది. హుటాహుటిన ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. రాంబాబు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

# మరో 10 కరోనా కేసులు



విశాఖపట్నం, జిల్లాలో ప్రతిరోజూ కొత్తగా కరోనా కేసులు నమోదవుతున్నాయి. సోమవారం మరో పది మందికి కరోనా వైరస్ సోకినట్టు నిర్ధారణ అయ్యింది. వీటితో మొత్తం కేసుల సంఖ్య 38కి చేరింది. అందులో ప్రస్తుతం 25 మంది చికిత్స పొందుతున్నారు. ఇరవై మంది హోమ్ ఐసోలేషన్‌లో, ఐదుగురు ఆస్పత్రిలో ఉన్నారు. కొవిడ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. మార్కెట్లు, రద్దీ ప్రాంతాలకు వెళ్లినప్పుడు మాస్కులు ధరించాలని, తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలని కోరుతున్నారు

# హైబీపీతో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు మృతి

నాగర్‌కర్నూల్,(ఆరోగ్యజ్యోతి): విధుల్లో ఉండగా రక్తపోటు(బీపీ) అధికమై చికిత్స పొందుతూ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులుమృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే..నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పోలీస్‌స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు విధులు నిర్వహిస్తుండగానే ఒక్కసారిగా అధిక రక్తపోటుకు గురై కిందపడిపోయాడు. గుర్తించిన సహచరులు దవాఖానకు తరలించారు. కాగా, హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతూ శ్రీనివాసులు మృతి చెందాడు.

# చాపకిందనీరులా విస్తరిస్తోన్న జేఎన్.

- 1 వేరియంట్.. 263కి చేరిన కేసులు




భారత్‌లో కరోనా సబ్ వేరియంట్ జేఎన్.1 చాపకిందనీరులా విస్తరిస్తోంది. దేశంలో ఈ తరహా కేసులు తాజాగా 200 దాటాయి. ఇప్పటి వరకూ జేఎన్.1 కేసులు 263కు చేరినట్లు ఇండియన్ సార్స్ కోవ్ 2 జెనోమిక్స్ కన్సార్టియం మంగళవారం వెల్లడించింది. పది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కొత్త వేరియంట్ విస్తరించిందని పేర్కొంది.ఇక ఈ తరహా కేసులు కేరళలోనే అత్యధికంగా నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. కేరళలో ఏకంగా 133 జేఎన్.1 కేసులు బయటపడ్డాయి. ఆ తర్వాత గోవాలో 51, గుజరాత్‌లో 34, ఢిల్లీలో 16, కర్ణాటకలో 8, మహారాష్ట్రలో 9, రాజస్థాన్‌లో 5, తమిళనాడులో 4, తెలంగాణలో 2, ఒడిశాలో 1 కేసు నమోదైనట్లు వెల్లడించింది. మొత్తం కేసుల్లో 239 కేసులు డిసెంబర్‌లో వెలుగు చూడగా.. 24 కేసులు నవంబర్ నెలలో బయటపడినట్లు ఇన్సాకాగ్ వివరించింది.మరోవైపు 2.86 రకానికి చెందిన ఈ జేఎన్.1 ఉపరకాన్ని ప్రత్యేకమైన 'వేరియంట్ ఆఫ్ ఇంట్రెస్ట్'గా ప్రపంచ ఆరోగ్య సంస్థ వర్గీకరించిన విషయం తెలిసిందే. దీని వ్యాప్తి వేగంగా ఉన్నప్పటికీ.. ముప్పు తక్కువేనని స్పష్టం చేసింది. ప్రస్తుతం దేశంలో ఈ రకం కేసులు పెరుగుతున్నప్పటికీ ప్రజలు భయపడాల్సిన అసవరం లేదని కేంద్ర ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.దేశంలో 4,565కి పెరిగిన క్రియాశీల కేసులు..

ఇదిలా ఉండగా.. భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. గత 24 గంటల వ్యవధిలో 573 కరోనా కేసులు బయటపడినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది. తాజా కేసులతో కలిపి దేశంలో క్రియాశీల కేసుల సంఖ్య 4,565కి పెరిగింది. ఇక నిన్న ఒక్కరోజే రెండు మరణాలు నమోదయ్యాయి. హర్యాణాలో ఒకరు, కర్ణాటకలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఇప్పటి వరకూ కొవిడ్ కారణంగా మరణించిన వారి సంఖ్య 5,33,366కి పెరిగింది. కొవిడ్ నుంచి కోలుకున్న వారి సంఖ్య 4,44,76,550గా ఉంది.

# వైద్య విద్యార్థులకు తీవ్రగాయాలు

జీజీహెచ్ (కాకినాడ)కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ ) చేస్తున్న ఇద్దరు వైద్య విద్యార్థులు సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతు న్నారు. తమిళనాడుకు చెందిన 30 ఏళ్ల డా.అరుల్, 30 ఏళ్ల డా.అనుసత్య షణ్ముఖ సుందరన్ ఆర్ఎంసీలోని ఈఎన్‌టీ విభాగంలో మొదటి సంవత్సరం పీజీ వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. వారిద్దరు జీజీహెచ్‌కు ఎదురుగా ఉన్న పీజీ హాస్టల్‌లో ఉంటూ చదువులో భాగంగా జీజీహెచ్‌లో విధులు నిర్వర్తిస్తుంటారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి హాస్టల్ నుంచి విధులకు హాజర య్యేందుకు బైక్‌పై జీజీహెచ్‌కు వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా మెయిన్ రోడ్డు వైపు నుంచి జిల్లా పరిషత్ వైపు వేగంగా వెళుతున్న మరో బైక్ వీరి బైక్‌ను బలంగా ఢీ కొట్టింది. దాంతో వైద్య విద్యార్థులు ఇరువురు చెల్లా చెదురుగా పడి తీవ్రంగా గాయపడ్డారు. అది గమనించిన స్థానికులు క్షతగాత్రులను అత్యవసర విభాగానికి తరలించగా అక్కడ వైద్యులు పలు వైద్య పరీక్షలు నిర్వర్తించి వైద్య చికిత్సను అందజేస్తున్నారు. అరుల్‌కు ఎడమ మోకాలు భాగం విరిగి, పాదం భాగం లో కన్నం పడి తీవ్ర రక్తస్రావం అయింది. అలాగే అనుసత్యకు ముఖం భాగంలో తీవ్ర గాయాలు అవడంతో ఈఎన్‌టీ వైద్యులు ప్రత్యేక వైద్య చికిత్సను అందజేస్తున్నారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రపంచంలోనే ట్రీట్మెంట్ లేని వ్యాధి

అది కూడా మహిళలకు ఎక్కువగా వస్తుంది

అలాంటి వాటిలో ఎండోమెట్రియాసిస్ ఒకటి



పరిష్కారంలేని సమస్యలు ఉండకపోవచ్చునేమో కానీ, చికిత్సలేని వ్యాధులు అరుదుగానైనా కొన్ని ఉంటాయని వైద్య నిపుణులు చెప్తున్నారు. అలాంటివాటిలో ఎండోమెట్రియాసిస్ ఒకటి. ఇది కేవలం మహిళలకు మాత్రమే వచ్చేవ్యాధి. వరల్డ్ పాపులేషన్లో దాదాపు 10 శాతం మంది స్త్రీలు దీనిబారిన పడుతున్నారని నివేదికలు పేర్కొంటున్నాయి. దీని ప్రధాన లక్షణం ఏంటంటే.. పీరియడ్ టైంలో బాధిత స్త్రీలకు, మిగతా స్త్రీలకంటే భిన్నంగా భయంకరమైన నొప్పి కలుగుతుంది.ముందుగా కటి భాగంలో నొప్పి మొదలవుతుంది. నెలసరి క్రమరహితంగా రావడంతోపాటు రక్తస్రావం అధికం అవుతుంది

అయితే ఇది జస్ట్ నెలసరి సమయంలోనే వచ్చిపోయే సమస్యగా ఉంటున్నప్పటికీ, ఈ వ్యాధితో ఇబ్బందిపడే మహిళల్లో క్రమంగా ఇతర అవయవాలకు కూడా నొప్పి పాకుతుంది. ప్రపంచ వ్యాప్తంగా 17 కోట్లమందికిపైగా ఇటువంటి సమస్యలను ఎదుర్కొంటున్నట్లు ఇటీవలి నివేదికలు పేర్కొన్నాయి. ముఖ్యంగా వక్షోజాల్లో నొప్పి, యూరిన్ ఇన్ఫెక్షన్, సెక్స్‌లో పాల్గొన్నప్పుడు నొప్పి కలగడం ఎండోమెట్రియాసిస్ వ్యాధి లక్షణాల్లో భాగమే. నెలసరి నొప్పికి తాత్కాలికంగా పెయిన్ కిల్లర్ వంటి మెడిసిన్స్ ఉన్నప్పటికీ ఈ వ్యాధిని శాశ్వతంగా తగ్గించే సరైన చికిత్స ఏదీ లేదని వైద్య నిపుణులు చెప్తున్నారు

# టిబి మందులను ఎలా వాడుతున్నారు ?

– టిబి సూపర్ వైజర్ జయప్రకాశ్



రాజోలి, మండల పరిధిలోని తుమ్మిల్ల గ్రామం లోని గ్రామ ప్రజ లకు టిబి పై రాజోలి ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం టిబి సూపర్ వైజర్ జయప్రకాశ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు వారాలుగా దగ్గు, జ్వరం, ఆయాసం, బరువు తగ్గడ%శీ%, ఆకలి మందగించటం, దగ్గి నపుడు గళ్ళ పడటం, నీరసంగా ఉండటం తదితర లక్షణాలు ఉన్న వారు వెంటనే గళ్ళ పరీక్షలు చేయించుకోవాలని ఆయన అన్నారు. ఆశా ల దగ్గర ఉన్న స్ఫుటం కప్స్ తీసుకొని తెల్లవారుజామున దగ్గు వచ్చినపుడు బాగా గట్టిగా దగ్గు దగ్గి స్పూటం కప్స్ లో గళ్ళ వేయాలని ఆయన అన్నారు.

వాటిని మా ఆశా లు రాజోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నకు తీసుకొని వచ్చి టిబి లాబ్ రిజిష్టర్ లో తమ పేర్లు నమోదు చేస్తారని, వాటిని మేము ప్రతి రోజు టీ హబ్ వాహనం లో గద్వాల్ జిల్లా కేంద్రం నకు తరలించడం జరుగుతుందని ఆయన అన్నారు. అక్కడ లాబ్ టెక్నీషియన్ గళ్ళ పరీక్షలు చేస్తారని, ఆ రిపోర్ట్ లో పాజిటివ్ వస్తే ఆ రోగికి 6నెలల వరకు ఉచితంగా టిబి మందులను పంపిణీ చేయటం జరుగుతుందని ఆయన చెప్పారు. అలాగే ప్రభుత్వం 6నెలల వరకు ప్రతి నెల అయిదు వందల రూపాయలు చొప్పున మూడు వేల రూపాయలు చెల్లిస్తుంది అని ఆయన తెలిపారు. అందుకు గాను టిబి రోగి యొక్క ఆధార్ కార్డ్,

బాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీ ఇవ్వాలనీ రాజోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టిబి సూపర్ వైజర్ జయప్రకాశ్ వివరించారు.

టిబి వచ్చినంత మాత్రాన భయపడవలసిన అవసరం లేదని మందులు వాడితే తగ్గుతుందని, మందులతో పాటు పౌష్టిక ఆహారం తీసుకోవాలని అప్పుడే టిబి రోగి త్వరగా కోలుకుని క్షేమంగా, ఆరోగ్యంగా ఉంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఎన్ ఎమ్ లు, ఆశా లు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

# కర్ణాటకలో భారీగా పెరిగిన 'కరోనా'..

మొత్తం పాజిటివ్ కేసులు ఎన్నో తెలిస్తే..



బెంగళూరు: రాష్ట్రంలో కొవిడ్ కేసులు పెరుగు తున్నాయి. సోమ వారం 296 మం దికి పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. 50మంది డిశ్చార్జ్ కాగా ఒకరు మృతిచెందారు. 1245 మంది చికిత్సలు పొందు తున్నారు. బెంగళూ రు లో 131మందికి మైసూ రులో 29మంది, హాసన్‌లో 17, తుమకూరులో 16, దక్షిణకన్నడలో 13, బళ్ళారిలో 11మందికి ప్రబలగా మిగిలిన జిల్లా ల్లో పదిలోపు కేసులు నమోదయ్యాయి. పాజిటివ్‌శాతం 5.89గా నమోదైంది.

# ఆసుపత్రిలో సమూల మార్పులు

ఇక రాత్రిళ్లు ఆకస్మిక తనిఖీలు


సూపరింటెండెంట్ వి.వెంకటరంగారెడ్డి



కర్నూలు,: ఎంతో నమ్మకంతో సుదూర ప్రాంతాల నుంచి అనేక మంది రోగులు ఇక్కడకు వస్తున్నారని, వారికి తగిన వైద్యం అందించేలా ఈ ఏడాది ప్రభుత్వ ఆస్పత్రిలో సమూల మా ర్పులు తెస్తున్నామని సూపరింటెండెంట్ డా.వి. వెంకటరం గారెడ్డి తెలి పారు. సోమవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో వైద్యులు, సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ క్యాజువాల్టీలో ప్రతిరోజు రాత్రి మెడిసిన్ విభాగానికి 60 నుండి 70 మంది ఇన్ పేషెంట్లు వస్తుంటారని అన్నారు. వీరందరికీ ఒక్క అసిస్టెం ట్ ప్రొఫెసర్ చికిత్స అందించలేరని, రాత్రిళ్లు ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫె సర్లను ఉంచాలని ఆదేశించామని తెలిపారు. గైనిక్, ఆర్థో, అనస్థీషియా విభాగాలకు ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు క్యాజువాల్టీ, ఏఎంసీల్లో అందుబాటులో ఉంటారని వివరించారు. ఏఎంసీలో ఇక నుంచి మెడిసిన్ ప్రొఫెసర్‌కు నెల రోజుల డ్యూటీ ఉంటుందని,

ప్రతిరోజు ఉదయం 10.30 గంటలకు అన్ని సూపర్ స్పెషాలిటీ వైద్యులు రోగులకు చికిత్స అందించా లని ఆదేశించారు. ఆరేడు మంది అధికారుల బృందం క్యాజువాల్టీ, ఏఎంసీ, గైనిక్‌తో పాటు ఇతర విభాగాలను రాత్రిళ్లు 12 గంటలకు, తెల్లవారుజామున 2 గంటలకు అకస్మిక తనిఖీలు చేస్తారని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, ఏడీ అనిల్ కుమార్ రెడ్డి, ఏవో శైలజ, అకౌంటెంట్ ఆఫీసర్ కుమారస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.





# ఏడేళ్ల జర్నీలో అన్నీ విజయాలే

సినీ ప్రవేశం ఆనందంగా ఉందన్న రష్మిక

పాత్ర ఏదైనా..పరకాయ ప్రవేశం చేయడం..పక్కింటి అమ్మాయిలా మెప్పించడం ఆమె నైజం. అందుకే అతి తక్కువ సమయంలో నేషనల్ క్రష్‌గా అందరి మదిలో నిలిచిపోయింది రష్మిక మందన్నా. కన్నడ 'కిరాక్ పార్టీ'తో హీరోయిన్ గా కెరీర్ మొదలుపెట్టిన రష్మిక 'ఛలో' సినిమాతో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చింది. తెలుగింట అతి తక్కువ సమయంలో స్టార్ హీరోల సరసన అవకాశాలు దక్కించుకుంది. చక్కని విజయాలు అందుకుంది. 'పుష్ప' చిత్రం సక్సెస్‌తో నేషనల్ క్రష్‌గా మారిపోయింది. ప్రస్తుతం తెలుగులో అగ్ర కథానాయికల్లో ఒకరిగా ఉంది. ఇటీవల 'యానిమాల్'తో బాక్సాఫీసు వద్ద భారీ విజయాన్ని అందుకుంది. రష్మిక సినీరంగంలోకి అడుగుపెట్టి ఏడేళ్లను విజయవంతంగా పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా తన సంతోషాన్ని అభిమానులతో పంచుకుంది. 'నా ఈ సినీప్రయాణంలో కొన్నిసార్లు వెనక్కితిరిగి చూసుకుంటే.. ఇదంతా ఎలా, ఎప్పుడు, ఎందుకు జరిగిందనిపిస్తోంది. సినిమా రంగంలోకి రావడం ఆనందంగా, గర్వంగా ఉంది. ఈ జీవితం కోసమే ఎన్నో కలలు కన్నాను. మంచి జీవితం కోసం పరుగులు తీస్తూనే ఉన్నాను. కానీ, సరైన వ్యక్తులు తోడుగా ఉండటం వల్ల ఆలోచించి అడుగులు వేయగలుగు తున్నాను. కలలు కంటూ పెరిగిన నేను సంతోషంగా, ప్రశాంతంగా ఉన్నాను. ఇలా లిటిల్ గర్ల్ తన కలల కోసం ఎదిగింది' అంటూ ఇనస్టాలో పోస్ట్ చేసింది. ప్రస్తుతం 'పుష్ప2', 'ది గర్ల్‌ఫ్రెండ్', 'ఛావా', 'రెయిన్‌బో' చిత్రాల్లో నటిస్తోంది రష్మిక.



# సెగ పుట్టిస్తున్న అందాల అరియానా!

అందాలు ఆరబోస్తేనే..సినిమాకు అందం..అవకాశాలు సొంతం..చాలామంది ఇదే సూత్రాన్ని పాటించి సినీ పరిశ్రమలో అడుగుపెట్టి సక్సెస్ అవుతుంటారు. వివాదస్పద దర్శకుడు రాంగోపాల్ వర్మ పక్కన ఏ అమ్మాయి కనిపించినా పాపురల్ కావడం మాత్రం ఖాయం. అలా పాపులర్ అయిన అమ్మాయిలో అరియానా గ్లోరి ఒకరు. యూట్యూబ్ యాంకర్‌గా గుర్తింపు తెచ్చుకున్న ఆమె ఆర్‌జీవీని హాట్‌హాట్‌గా ఇంటర్వ్యూ చేసి మరింత పాపులారిటీ తెచ్చుకుంది. ఆ క్రేజ్‌తో బిగ్ బాస్‌లో ఛాన్స కొట్టేసి ఇంకాస్త జనాల్లో గుర్తింపు పొందింది. అంతే కాదు సోషల్ మీడియాలో ఆమె పోస్ట్ చేసే హాట్ హాట్ ఫొటోలు కూడా యూతలో క్రేజ్ తీసుకొచ్చాయి. ఈ మధ్యన బీచ్‌లో బికినీ ధరించి పెట్టిన ఫొటోలు ఎంతగా వైరల్ అయ్యాయో తెలిసిందే. తాజాగా మరోసారి విజృంభించి అందాలు ఆరబోసింది అరియానా. తాజాగా పోస్ట్ చేసిన ఫొటోలతో సోషల్ మీడియాలో రచ్చరచ్చ చేస్తుంది. ఇదంతా సినిమాల్లో అవకాశాల కోసమే అని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. అయితే విమర్శలు ఎన్ని వచ్చినా అరియానా మాత్రం తగ్గట్లేదు. రోజు రోజుకు గ్లామర్ డోస్ పెంచుతుంది.. వెండితెరపై రాణించాలనే కోరికతో తరచూ అందాల ఆరబోతతో యువతకు నిద్ర లేకుండా చేస్తోంది. తన సొగసుతో మేకర్స్ చూపు తనవైపు తిప్పుకొనేందుకు ప్రయత్నాలు చేస్తోంది. తాజాగా న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా ఎంజాయ్ చేస్తున్న ఈ అమ్మడు ఓ స్విమ్మింగ్‌పూల్ పక్కన టూ పీస్ డ్రెస్‌తో కెమెరాకు ఫోజ్ ఇచ్చింది. అందాలను చూపిస్తూ అందాల ఆరబోతలో తగ్గేదేలే అంటూ హాట్‌హాట్‌గా ఉన్న ఆ ఫొటోలను ఇనస్టాలో షేర్ చేసింది. ఆ ఫొటోలు చూసిన యువత ఫిదా అవుతున్నారు. ఈ హాట్ గర్ల్ అరియానా ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.



# కెప్టెన్ మిల్లర్‌గా వస్తోన్న ధనుష్

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ కాంపౌండ్ నుంచి వస్తున్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ కెప్టెన్ మిల్లర్. యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీలో ధనుష్ టైటిల్ రోల్ పోషిస్తుండగా.. అరుణ్ మథేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే కెప్టెన్ మిల్లర్ ఫస్ట్ సింగిల్ కిల్లర్ కిల్లర్ నెట్టింటిని షేక్ చేస్తోంది. ధనుష్ కెప్టెన్ మిల్లర్‌గా ఎర్రటి స్కార్ఫ్ కట్టుకొని చేతిలో తుపాకీతో అగ్రెసివ్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తున్నాడు. తాజాగా కెప్టెన్ మిల్లర్ ప్రీ రిలీజ్ ఈవెంట్ అప్‌డేట్ అందించింది ధనుష్ అండ్ టీం. ఈ సీజన్ బిగ్గెస్ట్ ఈవెంట్.. కెప్టెన్ మిల్లర్ ప్రీ రిలీజ్ ఈవెంట్ చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో రేపు సాయంత్రం 6 గంటల నుంచి షురూ కానుంది. ఇదే విషయాన్ని తెలియజేస్తూ.. వీడియో రిలీజ్ చేశారు మేకర్స్. ఇప్పుడీ వీడియో నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. యాక్టింగ్ మాన్‌స్టర్ ధనుష్.. కెప్టెన్ మిల్లర్ ః÷నీనీట ఃజీబిఠ (రక్తపాతం) ఆన్ ది వే అంటూ ఇప్పటికే నెట్టింట క్యూరి యాసిటీ పెంచేస్తున్నారు అభిమానులు, మూవీ లవర్స్. ధనుష్ కామ్రేడ్ అవతార్‌లో సమరానికి అందరినీ మేల్కొలుపుతున్నట్టుగా ఉన్న కెప్టెన్ మిల్లర్ లుక్ ఇప్పటికే సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ మూవీలో కోలీవుడ్ భామ ప్రియాంక అరుళ్ మోహన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్, నివేదితా సతీశ్, అమెరికన్ యాక్టర్, ఆర్‌ఆర్‌ఆర్ ఫేం ఎడ్వర్డ్ సొన్నెన్‌బ్లిక్ ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. విప్లవయోధుడు కెప్టెన్ మిల్లర్ స్ఫూర్తితో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్ మరో కీలక పాత్రలో నటిస్తున్నాడు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. సత్య జ్యోతి ఫిలిమ్స్ తెరకెక్కిస్తున్న కెప్టెన్ మిల్లర్ తెలుగు, తమిళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. కెప్టెన్ మిల్లర్ ఆడియో రైట్స్‌ను పాపులర్ మ్యూజిక్ లేబుల్ సరిగమ సొంతం చేసుకుంది. పొంగళ్ కానుకగా జనవరి 2024లో రిలీజ్ కానుంది.

# జపాన్ భూకంపం కలచివేసింది

## అక్కడ దేవర షూట్ పూర్తి చేసుకున్న ఎన్టీఆర్




జపాన్‌లో సంభవించిన వరుస భూకంపాల ఘటనపై యంగ్ టైగర్ ఎన్టీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కొత్త ఏడాదికి ప్రజలందరూ స్వాగతం పలుకుతున్న వేళ జపాన్ ప్రజలు గుండెల్లో ఒక్కసారిగా అలజడి మొదలైంది. జపాన్‌లో షూటింగ్ ముగించుకొని సోమవారం రాత్రి తారక్ హైదరాబాద్ చేరుకున్నారు. వారం రోజులపాటు అక్కడ 'దేవర' చిత్రీకరణలో పాల్గొన్నారు. ఈ సినిమా చిత్రీకరించిన ప్రాంతంలో భూకంపం రావడం తన హృదయాన్ని కలచివేసిందని.. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు త్వరగా కోలుకోవాలని తారక్ ట్వీట్ చేశారు. "జపాన్ నుంచి ఇవాళే ఇంటికి వచ్చాను. అక్కడ భూకంపం గురించి తెలిసి షాక్ అయ్యాను. గత వారం అంతా అక్కడే ఉన్నాను. భూకంపం బారిన పడిన ప్రజల గురించి తలచుకుంటే గుండె తరుక్కు పోతోంది. వాళ్ళు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను. జపాన్ ప్రజలందరూ ధైర్యంగా ఉండండి' అని ఎన్టీఆర్ ట్వీట్ చేశారు. సోమవారం జపానలో దాదాపు 21 సార్లు భూమి కంపించడంతో పశ్చిమ ప్రాంతం అస్తవ్యస్తం అయింది. ఆరుగురు మృతి చెందగా.. పలువురు గాయపడినట్ల అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం తారక్ దేవర చిత్రంతో బిజీగా ఉన్నారు. జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తోంది.

# చెట్టాపట్టాలేసుకుంటున్న సిద్దార్థ్, అదితి రావు

## వెకేషన్ ట్రిప్ ఫోటోలతో నెట్టింట చర్చ

సిద్దార్థ్, అదితి రావు హైదరి మధ్య కుచ్ కుచ్ హోతా హై అని ఎప్పటి నుంచో టాక్ వినిపిస్తోంది. వీరిద్దరూ కలిసి అజయ్ భూపతి దర్శకత్వంలో 'మహా సముద్రం' చిత్రంలో నటించారు. అప్పుడే ఇద్దరి మధ్య ప్రేమ చిగురించిందని ప్రచారం నడుస్తోంది. ఓ సందర్భంలో అలాంటిది ఏమీ లేదంటూ సెలవిచ్చారు. కానీ తరచూ పార్టీలకు, షికార్లకు వెళ్తూనే కనిపించారు. హిట్ పాటలకు రీల్స్ కూడా చేశారు. ఇద్దరూ కలిసి ఎన్నోసార్లు కెమెరాకు చిక్కారు. తాజాగా మరోసారి ఈ జంట వార్తల్లో నిలిచారు. తాజాగా అదితీరావు హైదరీ సిద్దార్థ్‌తో ఉన్న ఫొటోను షేర్ చేసి 'హ్యాపీ బ్లెస్డ్ గ్రేట్‌ఫుల్' అని పోస్ట్ చేసింది. 'మ్యాజిక్ చేయాలంటే.. ఆనందం, ప్రేమ, నవ్వులు, ఇంద్రధనస్సు..ఉండాలి. ఇవన్నీ నీతోనే సాధ్యం అనే అర్థం వచ్చేలా ఆమె చేసిన పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. దీనిని చూసిన నెటిజన్లు ఇద్దరి మధ్య ఉన్న లవ్‌స్టోరీని అఫీషియల్‌గా చెప్పారనే ఊహల్లో ఉన్నారు. ఇంతకీ సిద్దార్థ్, అదితీల మధ్యనున్న ప్రేమకు ఇది అఫీషియల్ అనౌన్స్ మెంట్ అనుకోవచ్చా అంటూ ప్రశ్నలు సంధిస్తున్నారు. గతంలో ఓ ఇంటర్వ్యూలో సిద్దార్థ్‌తో డేటింగ్‌పై ప్రశ్న ఎదురైంది. దీనిపై ఆమె స్పందిస్తూ అలాంటిది ఏమన్నా ఉంటే నేనే చెప్తానంటూ మాట దాటవేసింది. అయినా నేనేం చెప్పినా చివరకు మీకు నచ్చినట్లుగానే ఊహించుకుంటారుగా అని కౌంటర్ కూడా వేసింది.

బొమ్మరిల్లు హీరోగా తెలుగు ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్రవేసుకున్న సిద్దార్థ్ 2023లో చిన్నా సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడని తెలిసిందే. సమ్మోహనం, మహాసముద్రం,




వీ సినిమాలతో అందరికీ హాయ్ చెప్పింది అదితీరావ్ హైదరి. ఈ హైదరాబాదీ ముద్దుగుమ్మ సిద్దార్థ్‌తో కలిసి చక్కర్లు కొడుతూ.. నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తన బాయ్ ఫ్రెండ్ సిద్దార్థ్‌తో కలిసి న్యూ ఇయర్ వెకేషన్ ట్రిప్ వేసింది. ఇంతకీ ఈ ఇద్దరు ఎక్కడికెళ్లారనేది ప్రస్తుతానికి స ౖస్పన్స్ లో ఉండగా.. ఈ ఫొటోలు మాత్రం నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాయి. మొత్తానికి ఈ క్రేజీ యాక్టర్లు 2024 సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా తమ రిలేషన్ షిప్‌ను ఇలా అధికారికంగా ఫైనల్ చేశారంటూ ఇప్పుడు నెట్టింట తెగ చర్చించుకుంటున్నారు మూవీ లవర్స్.